# ఆ ఇంటి కథ



**-చిత్రపు హనుమంతరావ్**

విత్తనాలు ఒకటే అయినా, అది పెరిగిన మడి ఒకటే అయినా, మొలకలు తల ఎత్తి అవి కొమ్మలూ, రెమ్మలూ అవడం ప్రారంభం అయాక, ఏ మొక్క దారి దానిది. ఏ కొమ్మ పద్ధతి ఆ కొమ్మది. తరువాత ఏ మొలక ఏ తోటలో ఏ తీరున పెరుగుతుందో ఎవరికి తెలుసు? ఒకే మడిలో పెరిగిన మొక్కలకీ, ఒకే కడుపున కాచిన కాయలకీ చిన్ననాటి సఖ్యతలు పెద్దయ్యాక స్వార్థంగా మారి బంధుత్వాలనే ప్రశ్నకు పెడుతుందేమో!

"ఆ పాటిదానికే వంటివెధవమీద చెయ్యి చేసుకోవాలా? బాగా తగిలేయేమో దెబ్బలు — గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. . ."

సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి చేరుకోగానే నా కళ్లబడ్డ దృశ్యం—మా అబ్బాయి ఆడుకుంటున్నాడు. నా దృష్టిలో అది ఆకతాయితనమైనా, వాడి తల్లి దృష్టిలో అది ఆటే మరి! మత్తి పట్టుకుని తన బలాబలాలు వాలుకుర్చీ మీద చూపిస్తున్నాడు. ఆ దెబ్బలు నా గుండెమీద కొడుతున్నట్లే అనిపించడంతో, ఒక్క అంగలో వెళ్లి వాడి రెక్క పట్టుకున్నాను. ఇంకా వాడిమీద ఒక్క దెబ్బ వెయ్యనే లేదు ... అంతలోకే నే నేదో కొట్టేసినట్లు ఇంటి కప్పు ఎగిరిపోయేంత గట్టిగా అరున్నొక్క రాగం ఆలాపించడం మొదలుపెట్టాడు. హాల్లో కుర్చీలో కూర్చుని రేడియోలో పాటలు వింటూ, బేబీకి (పుట్టబోయే) మేజోళ్లు అల్లుతున్న శ్రీమతి చేతిలో ఉన్న వూలూ, సిడిల్సూ బల్లమీద పడేసి, కంగారు కంగారుగా వరండాలోకి వచ్చింది. మా అబ్బాయి రాగం మరింత పెంచి,పరుగెత్తుకెళ్లి తల్లికాళ్లను చుట్టేసుకున్నాడు. శ్రీమతి వాడిని ఎత్తుకుని, గుండెలకు హత్తుకుని, ఒళ్లు నిమురుతూ తీక్షణ వీక్షణాలతో నా వైపు చూస్తూ పై మాటలన్నది! నే నేం సమాధానం చెప్పగలను? ఆ తరవాత వాడి కళ్లు చీరకొంగుతో తుడుస్తూ, "ఏం, నాన్నా, బాగా తగిలేయా దెబ్బలు? ఆ కుర్చీ జోలికి పోవద్దంటే మానవుకదా" అన్నది.

మా అబ్బాయి నవ్వులు ఒలకబోస్తున్నాడు. తల్లి నన్ను కసురుతున్నప్పుడు వాడికి మరింత నవ్వు వస్తుంది. మా అబ్బాయి తెలివితేటలు అమోఘం. ఓ దెబ్బ వేద్దామని నేను చెయ్యి ఎత్తేలోపల ఏడవడం మొదలుపెడతాడు. దానితో శ్రీమతి వాడిని నే నేదో కొట్టేస్తున్నట్లు మాట్లాడుతుంది. వాడు నాకు మాత్రం కొడుకు కాదూ? కొట్టాలనుకుంటానే గాని, వాడిని కొట్టగలనా? అయితే, వాడు వినోదం చూస్తూ నవ్వుతున్నప్పుడు మాత్రం వాలుగు వాయించాలనిపిస్తుంది.

కుర్చీవైపు చూశాను. ముందు కోడు అసలే అవుగ్గా ఉంది. మా అబ్బాయి కొట్టిన దెబ్బలకి ముందుకోడు మేకు బయటకు వచ్చేసింది. మత్తి తీసుకుని కోడు సరిచేస్తూంటే—

"రేపట్నుండి మీ కుర్చీ ముందు గదిలో పెట్టుకుని తాళం వేసుకుని వెళ్లండి" అన్నది శ్రీమతి.

నే నేదో చెబుదామనుకున్నంతలో మా అబ్బాయి నోరు విప్పాడు:

"వద్దే, అమ్మా ... అది అక్కడే ఉండనియ్యవే. . ."

"పిచ్చినాన్నా! అది అక్కడే ఉంటే ఈవేళలాగే రోజూ దెబ్బలు తినాల్రా!"

అసలు నేను వాడిమీద చెయ్యి చేసుకున్నానా? లేదంటే నమ్మదే! వాడు పుట్టకముందు మా ఆవిడ నే నన్నదానికి ఎన్నడైనా కాదని ఎరుగునా? అలాంటిది—ఇప్పుడు వాడు చెప్పిందే వింటూంది కాని, నేను చెప్పింది వినడంలేదే?

"నేను వాడిమీద చెయ్యి వెయ్యనే లేదు. . ."

"మీరు మరీ చెబుతార్లెస్తురూ! మీరు కొట్టలేదు, వాడు నరదాకొద్ది ఏడిచాడు. అంతేనా?" దిగజారుతున్న కోపం ఎగదన్నింది. శ్రీమతి ఆ కోపంలో ఉన్నప్పుడు రాజీపడ్డమే మంచిదనిపించింది!

"ఇంకా సంగతి వదిలెయ్యి. కాస్త చల్లటి మాటలు చెప్పు. ఆఫీసులో పనిచేసి పనిచేసి వచ్చానా!"

"అక్కడికి నేనే విశ్రాంతి తీసుకుంటున్నట్లు! పిడు నన్ను వదులోనిస్తేగా?"

మా సుపుత్రుడి అల్లరి తనకి మాత్రం తెలియకనా? అదే మాట నే నంటే ససేమిరా ఒప్పుకోదు.

"బేబీకి అల్లుతున్న మేజోళ్లు ఎంత వరకూ వచ్చాయి?"

శ్రీమతి నా మాటలు వినిపించుకోలేదు.

"నీకు ఈ నీలం రంగు చీరె ఎంత బాగా నప్పిందనీ! నువ్వెంత అందంగా ఉన్నావంటే. . ."

శ్రీమతి మూతి మూడు వంకర్లు తిప్పి, "మరే" అంటూ లోపలికి దారి తీసింది. చంకన ఉన్న మా అబ్బాయి నా వైపు చూసి నవ్వుతున్నాడు.

మా అబ్బాయి వయసు సుమారు అయిదేళ్లు. వాడి తరవాత కాయా కసురూ లేకపోవడంతో ఇంట్లో ఏకచ్ఛత్రాధిపత్యం వహించేస్తున్నాడు. రోజు రోజుకీ వాడి ఆకతాయితనం హెచ్చుతున్నదే కాని, తగ్గుముఖం పట్టడం

లేదు. ఇంతవరకూ వాడికి అ . . . ఆ లు కూడా ఒంటబట్టలేదు. ఆర్నెల్ల క్రితం వాడిని స్కూల్లో చేర్పించడమైతే అయిందికాని, మొదటిరోజు నేను స్కూల్లో దిగవిడిచి వచ్చిన పావుగంట కల్లా రాగాలు తీస్తూ ఇంటికి వచ్చేశాడు. ఆ మర్నాడు నేను స్కూలుకి తీసుకు వెళ్లబోతే రానని మొరాయించాడు.

"వెధవన్నకి అయిదేళ్లు నిండలేదు. అప్పుడే చదువు కేమంత తొందర రొచ్చింది?" అన్నది శ్రీమతి. ఆ వయసుకి నేను స్కూలుకు పోలేదూ? తను మాత్రం వెళ్లలేదూ? ఆ మాటే పైకి అన్నాను.

"నాకు బుద్ధిపుట్టి వెళ్లేదాన్ని. మా అమ్మా, నాన్నా నన్ను తిట్టి, కొట్టి బడికి పంపలేదు సుమండీ! మీ వాళ్లు మిమ్మల్ని తిట్టి, కొట్టి పంపేవారేమో మరి? నాకు అలా చెయ్యడానికి మనసొప్పదు. కొంతకాలం పోతే వాడే బుద్ధి పుట్టి వెడతాడు" అంటూ మాటలు సాగదీసింది శ్రీమతి, అక్కడికి తనకే కొడుకుపై ప్రేమ ఉన్నట్లూ, నాకు లేనట్లూ!

కుర్చీలో కూర్చున్నాను ఆలోచిస్తూ.

"ఇంకా ఎంతసేపు నిలబడాలిట నే నిక్కడ?"

తల ఎత్తి చూశాను. ఒక చేత్తో కాఫీగ్లాసు పట్టుకుని, నా వైపు చూస్తూ నవ్వుతూ నిలబడి ఉంది శ్రీమతి. ఇంత క్రితం కోపం ఎక్కడికి పోయినట్లో?

"గ్లాసు తీసుకోండి."

"కొంత దగ్గరకు వద్దూ!"

"సరి సరి! వాడికి అన్నం పెట్టి వచ్చాను. నేను దగ్గర లేకపోతే వాడు వంటిల్లు ఓ కొలిక్కి తెస్తాడు."

కాఫీగ్లాసు ఖాళీచేసి శ్రీమతి చేతి కిచ్చాను. సిగరెట్టు ముట్టించుకుని, ఓ దమ్ము లాగి పొగ-వదిలి, ఆ పొగ సృష్టిస్తూన్న వింత వింత ఆకారాలను చూస్తున్నాను.

"ఆ కుర్చీమీద ఉన్నపాటి శ్రద్ధ ఆరోగ్యంపై ఉంటే బాగుండును కద. సిగరెట్లు కాల్చి కాల్చి రాత్రంతా ఒకటే దగ్గు. అనుకుని లాభమేమిటిలెండి? కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందట."

శ్రీమతి మాటలు సాగదీస్తూ గొణుగుతూంది. అంతవరకూ తను నా వెనకే నిలబడినట్లు నాకు తెలియదు. మాటలు సాగదీస్తూ గొణగడం స్త్రీజాతికి పుట్టుకతోనే అబ్బిన విద్యేమో?

"కాఫీ తాగేక కాల్చకపోతే తోచదు. భోజనమయ్యేంతవరకూ మరి కాల్చనులే."

శ్రీమతి మాట్లాడలేదు. లోపలకు వెళ్లిపోయింది.

ఆ కుర్చీ విలువ మా అబ్బాయికి కాని, వాడి తల్లికికాని తెలియదు. మా అమ్మ




ఆ కుర్చీకి 'మయూరాసన'మని పేరు ఎందుకు పెట్టిందో నాకూ తెలియదు!

పాత కాలం క్రరగేటు. రెండు పక్కలా స్తంభాలు. వాటిని కలుపుతూ ఇరుపక్కలా మనిషెత్తున కాంపౌండ్ వాల్. గేటు తెరిస్తే గజం వెడల్పున కాలిబాట. ఆ బాట చివర మెట్లు. మెట్లెక్కితే వరండా. వరండాకి ఇరు పక్కలా రెండు గదులు. వరండా వెనక హాలు. వరండాలో కుడివైపున మయూరాసనం. కుడివక్క గది నాన్నగారిది. తీరిక వేళల్లో ఆ కుర్చీలో కూర్చునే మూర్తి నాన్నగారు. నన్నని పొడవైన విగ్రహం నాన్నగారిది. శరీరవర్ణం కొస్త నలుపైనా, చామనచాయలో జమ కట్ట వచ్చును. ఆయన విశాలమైన కళ్లు శాంతికి నిలయాలు. పొడవాటి నాసిక కోపానికి కొలబద్ద. నలుగురూ నాన్నగారిని గురించి అనుకునే మాట—'సుందర రామయ్యగారికి ముక్కుపైనే ఉంటుంది కోపం' అని. అమ్మ అంటూ ఉండేది—తను కాపురానికి వచ్చిన కొత్తల్లో బామ్మ అనేదట, 'వాడికి కొస్త కోపం ఎక్కువే, తల్లీ! ఎలా నెగ్గుకొస్తావో కాని' అని.

అయితే, ఆ మయూరాసనంలో కూర్చున్నప్పుడు నాన్నగారు శాంతమూర్తి. ఆయన కోపం ఎక్కడకు పోయేదో మరి. భగవద్గీత చదువుతూనో, ఆలోచిస్తూనో కూర్చునేవారు.

నాకు జ్ఞానం వచ్చేసరికే నాన్నగారి జుత్తు ముగ్గుబుట్టలా తయారయింది. గుబురుమీసాల్లో అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు ప్రత్యక్షమయినాయి. నాకు అనిపించేది-'అసలు నాన్నగారి జుత్తు ఏనాడైనా నల్లగా ఉండేదా?' అని. ఓ సారి ఆ మాటే అమ్మతో అన్నాను. అమ్మ పడిపడి నవ్వింది. ఆ తరవాత "కాటుకంత నల్లగా నిగనిగలాడుతూ ఉండేదిరా. మా వాళ్ళు ఆయన జుత్తు చూసి ముచ్చటపడేవారురా" అన్నది.

నాన్నగారు ఏభయిమూడో ఏట తహసీల్దారు అయినారు. అప్పటికి ఆయన తోటివాళ్ళందరూ డెప్యూటీ కలక్టర్లూ, కలక్టర్లూ అయ్యారు. దానికి తగిన కారణాలు ఉండగా, పై వాళ్ళను అనుకోవడ మెందుకు? తాను లంచం తీసుకోకపోతే మానె, తీసుకునే వాళ్ళను నిరసిస్తూ ప్రవర్తించడ మెందుకు? పై అధికారులు వచ్చినప్పుడు విందులు చెయ్యలేదు. విదేశీ ద్రావకాల్ని సరఫరా చెయ్యలేదు. ఆయన దృష్టిలో వాళ్ళకూ, తనకూ ఉన్న సంబంధమల్లా ఆఫీసులోనే! బయటకు వచ్చాక వాళ్ళు తోటిమానవులు. ఆఫీసులో 'సార్' అనడం తప్పనిసరైనా, బయటకు వచ్చాక వంగి వంగి సలాములు చెయ్యనక్కర్లేదు. వాళ్ళు అన్నదానికల్లా 'చిత్తం, చిత్తం' అంటూ బుర్ర ఆడించవలసిన అవసరమూ లేదు. నీతి, నిజాయితీల కోసం పాకులాడితే ఆయనకు దక్కిన ఫలితం? సర్వీసెంత కాలముందో గుణించుకునే రోజుల్లో తహసీల్దారును చేశారు. ఉన్న ఊళ్ళో ఛార్జి ఇచ్చి, ట్రాన్స్‌ఫర్ అయిన ఊరు చేరుకుని, ఛార్జి తీసుకుని, కుటుంబాన్ని తీసుకువెళ్ళి అవసరా అన్నీ సమకూర్చునేలోపల మరో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ ఆయన్ను వెతుక్కుంటూ వచ్చేది! ఈ ట్రాన్స్‌ఫర్లతో విసిగిపోయి, ఉద్యోగానికి తిలోదకాలిచ్చుకుందా మనుకున్న సందర్భాలు లేకపోలేదు! అయితే, ఓరిమితో నెట్టుకొచ్చేవారు. ఉద్యోగరీత్యా నాన్నగారు ఆంధ్రదేశంలో చూడని ఊళ్ళు అరుదనే చెప్పాలి!


ఏభయి అయిదేళ్ళ కల్లా నాన్నగారు రిటైరయినారు. ఎక్స్‌టెన్షన్ ఆయన అడగనూ లేదు, వాళ్ళు ఇవ్వనూ లేదు. అయితే, నాన్నగారు తహసీల్దారు గిరీ వెలగబెట్టింది రెండేళ్ళయినా, అందరూ ఆయన్ని తహసీల్దారుగారు అనే అనేవారు.

రాజమండ్రి వచ్చేశాము. ఆ ఊళ్ళో దానవాయిపేటలో నాన్నగారికి ఆయన తండ్రి ఇచ్చిన ఇల్లు ఉంది. నాన్నగారికి తోబుట్టువు లెవరూ లేకపోవడం వల్ల, ఆ ఇంటిని వాటాలు వేసుకోవలసిన అవసరం కలగలేదు.

అప్పటికి నా వయసు పన్నెండేళ్ళు. థర్డ్ ఫారమ్ చదువుతున్నాను. మీనాక్షి అక్కయ్య వయసు పదిహేడు. గోపాలం అన్నయ్య వయసు ఇరవై. అన్నయ్య విశాఖపట్నం మెడికల్ కాలేజీ విద్యార్థి.

ఏడాదిక్రితం అక్కయ్య ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షకు వెళ్ళడమూ, ఫెయిలవ్వడమూ జరిగింది. అస లెలా పాసవుతుంది? ఏనాడైనా క్లాసు పుస్తకాలు ముట్టిన పాపాన పోతేనా? ఇంచుమించు పొద్దస్తమానమూ నిలువుటద్దం ముందు బల్లమీద కూర్చునేది. అనేక భంగిమల్లో తన ప్రతిబింబాన్ని మరీ మరీ చూసుకునేది. మెడలో హారాలు మార్చేది. చెవులకు లోలక్కులూ, జూకాలూ, దుద్దులూ — ఒకదాని తరవా తొకటి మార్చి, త నెలా ఉన్నదీ చూసుకునేది. ఒకొక్కసారి తనలో తాను నవ్వుకునేది. అరమోడ్పు కన్నులతో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ కూనిదీర్ఘాలు తీసేది. మా వీథిలో ఉండే కాలేజీ స్టూడెంట్లు అక్కయ్యకి ఇచ్చిన బిరుదులు—'మెరుపుతీగె', 'గులాబ్ కా ఫూల్'. ఉదయం కాలేజీకి వెళ్ళేటప్పుడూ, సాయంత్రం ఇళ్ళకు పోయేటప్పుడూ మా ఇంటిముందు తచ్చాడేవారు. సాయంత్రపు వేళల్లో నాన్నగారు ఇంటిముందున్న పూలమొక్కల్లో మయూరాసనం వేసుకుని కూర్చునేవారు. వాళ్ళు అలా తచ్చాడుతూ ఉంటే, మొక్కలను చూస్తున్నారని భ్రమపడి—'లోపలకు వచ్చి చూడండోయ్' అనేవారు. నాన్నగారు అలా అనడమే తరవాయి, వాళ్ళు లోపలకు బిలబిలా వచ్చి, పూలమొక్కల్ని చూసినట్లే చూసి, 'మీ గార్డెన్‌ని చూస్తూంటే కడుపు నిండిపోతుందండీ! ఇలాటి గార్డెన్ ఊళ్ళో మరెక్కడా లేదండీ' అంటూ మా గార్డెన్‌కి ఓ సర్టిఫికేటు పడేసి చక్కా పోయేవారు. నాన్నగారి గుబురుమీసాల వెనక చిరునవ్వు మెదిలేది.

మా లెక్కలమాస్టారి పేరు నరసింహశాస్త్రిగారు. ఆయన అంత పొడగరి కాదు కానీ, దృఢకాయుడు. ఆయన తల ఎప్పుడూ అప్పుడే చిత్రిక పట్టిన టేకుముక్కలా నిగనిగలాడుతూ ఉండేది. తల వెనక కొత్తిమేరకట్టలా పిలక. ఆ పిలక సుమారు ఓ అడుగు పొడుగు ఉండేది. ఆడపిల్ల జడ వేసుకున్నట్లు దానికి చక్కగా కొబ్బరినూనె రాసి, దువ్వెనతో దువ్వి ముడి వేసేవారు. చెవులకు పోగులు. చెవుల వెనక నందివర్ధనం పువ్వులు. నుదుట విభూతిచారలు. . . ఆయన ఏనాడూ, ఏ విద్యార్థినీ పేరుపెట్టి పిలిచిన పాపాన పోలేదు. ఒక చేత్తో సుద్దముక్క పట్టుకుని, మరో చేత్తో పేముబెత్తాన్ని ఝళిపిస్తూ ప్రశ్నలడిగేవారు. ఆ బెత్తాన్ని చూడగానే బుర్రలో ఉన్నది ఆవిరై బయటకు పోయేది. ఫలితం— ఆయన నోటంట వచ్చే ఊతపదాలు— వెధవ, శుంఠ మొదలయినవి. నాన్నగారంటే ఆయనకు భక్తిగౌరవాలు ఉన్నాయో, లేదో తెలియదు కాని, నన్ను ఉద్దేశిస్తూ ఆయన అనే మాటలు: 'మీ నాన్నకి ఎన్నడైనా లెక్కల్లో నూటికి నూరు మార్కులు తక్కువొచ్చాయిరా? ఆ తండ్రి కడుపున ఎలా పుట్టావురా? తులసికోటలో గంజాయి మొక్కలా!' మరో విద్యార్థిని ఉద్దేశిస్తూ అనే మాటలు: 'బ్రిడ్జిమీదకు పోయి, ఏడో స్తంభం దగ్గర గోదావర్లో దూకకూడదట్రా? మీ నాన్నకి డబ్బు ఖర్చు తగ్గుతుంది; నాకు కాస్త శాంతి దొరుకుతుంది.' ఆయన చెయ్యి పట్టమన్నప్పుడు పట్టవలసిందే. లేకపోతే అసలుకి వడ్డీ కలిసి శిక్ష మరింతయ్యేది. మెడ వంచి వీపుమీద గుద్దేవారు. ఆయన ఎన్నడైనా ముక్కు చీది ఎరుగునా? మోపెడంత హోమ్ వర్క్ ఇచ్చి మరునాటికల్లా చేసి తీసుకు రమ్మనడం ఆయనకు అలవాటు. ఇంటికి వచ్చి చేద్దామని కూర్చుంటే చెయ్యి కదిలితేనా? అసలు మాస్టారి పాఠం అర్థమైతే కదా! క్లాసులో భయంతో కూర్చున్నప్పుడు పాఠం బుర్రకెలా ఎక్కుతుంది? కిందా మీదా



పడ్డా ఒక లెక్కా కొరకబడేది కాదు. పోనీ, అక్కయ్యను అడుగుదామా అంటే, లెక్కల్లో దాని కున్న ప్రజ్ఞ ఏ పాటిది? అక్కయ్య ఎస్. ఎస్. ఎల్. సి. రిజిస్టరు వచ్చినప్పుడు మా ఇంట్లో జరిగిన సంఘటన—అమ్మ అక్కయ్యకు లెక్కల్లో వచ్చిన మార్కులు చూసి, 'పేపరు దిద్దిన వాడు ఎంత కర్కోటకుడో! నిర్దాక్షిణ్యంగా అలా వేస్తాడా మార్కులు? అసలు వాడికి పిల్లలు ఉండి ఉండరు' అంటూ ఎగ్జామినరును శాపనార్థాలు పెట్టింది. 'పాపా! నెక్స్ట్ టైమ్ బెటర్ లక్' అన్నాడు అన్నయ్య. కుర్చీలోనే కూర్చున్న నాన్నగారు 'పాపా, ఈ సారి లెక్కలకు కావాలంటే ప్రైవేటు పెట్టించుకో' అన్నారు. అక్కయ్య కళ్లు తుడుచుకుంటూ తన గదిలోకి పోయి, ఆ రిజిస్టరును బల్లమీదకు విసిరింది. ఆ తరవాత నేను కుతూహలాన్ని అణచుకోలేక అక్కయ్య మార్కులు చూడబోయాను. లెక్కల్లో అయిదుకి ఇటూ, అటూ బాడీగార్డులు. ఎప్పుడు వచ్చిందో అక్కయ్య, వెనక నుండి వచ్చి, నా చెవి పట్టుకుంది — 'ఏవిట్రా చూస్తున్నా'వంటూ. కంగారుగా వెనుదిరిగాను. 'నా మార్కుల సంగతి ఎక్కడైనా కూసేవు, జాగ్రత్త. ఒళ్లు హూనం చేసేస్తాను' అంటూ గుడ్లెర్రజేసింది. అలాటి అక్కయ్య లెక్కల్లో నా కేపాటి సహాయం చెయ్యగలదు? ఒళ్లు మాస్టారికి వప్పగించి, తల దించుకోవడం కంటే మార్గం లేదు!

ఇలాటి సమయంలో మా ఎదురింట్లో ముందు గదిలో కాలేజీలో మాథమెటిక్స్ లెక్చరర్‌గా ఒకరు అద్దెకు దిగారు. ఆయన పేరు భాస్కరం. వయసు సుమారు ఇరవైమూడేళ్లు. బ్రహ్మచారి. పొడవైన భారీ విగ్రహం. పక్కపాపిడి తీసి దువ్విన నిగనిగలాడే నల్లని నొక్కుల జుత్తు. విశాలమైన నుదురు. విశాలమైన కళ్లు. ఎల్లవేళలా పెదాలపై చిందులాడే చిరునగవు. ధరించే ఖరీదైన బట్టల్లో ఆయన మరింత హుందాగా కనిపించేవారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఎవ్వరినైనా ఇట్టే ఆకర్షించగల విగ్రహ మాయనది!

సాయంత్రం స్కూలునుండి ఇంటికి వచ్చీ రావడంతోనే, పుస్తకాలు ఇంట్లో పడేసి, ఆడుకోవడానికి పార్కుకి పరుగెత్తేవాడిని. నాన్నగారు పూలమొక్కల్లో కుర్చీ వేసుకుని కూర్చునేవారు. అక్కయ్య డాబా మీదకు పోయి పచార్లు చేస్తూ, కూనిదీర్ఘాలు తీస్తూ చీకటి పడేంత వరకూ గడిపేది. భాస్కరంగారు వాళ్ల డాబామీద పచార్లు చేస్తూ, మధ్య మధ్య వీథిలో జనాన్ని చూస్తూ గడిపేవారు.

ఒక రోజు సాయంత్రం పార్కు నుండి ఇంటికి తిరిగి వస్తూంటే భాస్కరంగారు ఎదురై, 'నువ్వు తహసీల్దారుగారి అబ్బాయివి కదూ?' అంటూ నన్ను నిలబెట్టేశారు. 'నీ పేరేమిటి?' అన్న ప్రశ్నతో మొదలుపెట్టి, ప్రశ్నల వర్షం కురిపించారు. సమాధానాలు చెప్పలేక ఉక్కిరిబిక్కిరయ్యాను. చివరకు— 'లెక్కల్లో ఎలా వస్తాయి మార్కులు?' అన్న ప్రశ్న దగ్గర, 'దాన్లోనే వీక్ అండీ' అన్న సమాధానంతో ఆయన ప్రశ్నల పరంపరను ఆపగలిగాను. 'లెక్కలు తక్కిన సబ్జెక్టుల కంటె సులువైనదోయ్. మీ మాస్టారికి చెప్పడం చేతకాదేమో?' అన్నారు. 'మా మాస్టారికి అసలు చెప్పడం చేతకాదండి.' హుషారుగా అన్నాను. ఆయన కొద్దిసేపు ఆలోచించి, 'నీకు తెలియనివి ఉంటే నా దగ్గరకు రా, చెబుతాను. రాత్రిపూట నాకూ తోచడం లేదు' అన్నారు. నాకు చాలా సంతోషమయింది. 'మీరు చాలా మంచివారండీ' అన్నాను. ఆయన చిరునవ్వు ముఖంతో— 'సరేలే. ఇంటికి వెళ్లు. చీకటి పడింది. మీ వాళ్లు కూకలేస్తారు' అంటూ ముందుకి సాగిపోయారు.

భాస్కరంగారి మంచితనాన్ని నా లోనే దాచుకోలేక, ఆ రోజు రాత్రి అక్కయ్య దగ్గరకు చేరి జరిగినదంతా చెప్పి, 'అక్కా! లెక్చరర్‌గారు చాలా మంచివారే' అన్నాను. అక్కయ్య నా వైపు నవ్వుముఖంతో చూస్తూ, 'ఊఁ' అన్నది. ఆ క్షణాన అక్కయ్య కళ్లు ప్రకాశవంతమవడం గమనించకపోలేదు!

ఆ మరునాటినుండీ సాయంత్రం పార్కునుండి ఇంటికి రాగానే, పుస్తకాలు పట్టుకుని భాస్కరంగారి దగ్గరకు పరుగెత్తేవాడిని. ఆయన పాఠం అర్థమయేటట్లు బోధపరిచేవారు. ఇంటికి వచ్చి కుదురుగా కూర్చుని హోమ్ వర్కు పూర్తిచేసేవాడిని. భాస్కరంగారి దయ వల్ల మాస్టారి చేతిలో దెబ్బలు తప్పినాయి. రానురాను లెక్కలు అనుకున్నంత కష్టం కాదు అనిపించేది. దానిపై మక్కువ కలగసాగింది!

సుమారొక రెండు నెలలు గడిచాయి. ఓ రోజు లెక్కలు చెప్పించుకుని ఇంటికి వస్తూంటే, సందేహిస్తూనే— 'ఓ చిన్న సహాయం చేసి పెట్టాలోయ్' అన్నారు భాస్కరంగారు మెల్లగా. ఎంత సహాయం చేసినా, ఆయన నాకు చేస్తున్న సహాయానికి బదులు తీర్చగలనా? 'చెప్పండి' అన్నాను. ఓ కవరు నా చేతి కిచ్చి, ఎవరూ చూడకుండా అక్కయ్యకు ఇవ్వమన్నారు.

ఆ రోజు రాత్రి అక్కయ్య తన గదిలో కూర్చుని కథల పుస్తకం చదువుకుంటున్న వేళ, ఆ కవరు దాని చేతి కిచ్చి లెక్చరర్‌గారు ఇవ్వమన్నారని చెప్పాను. ఆ కవరు చూస్తూ నేను ఇక్కడే నిలబడి ఉండడం గమనించి— 'సరేలే, నువ్వు వెళ్లు' అంటూ నన్ను సాగనంపి గది తలుపులు వేసేసుకుంది. ఆ మరునాడు సాయంత్రం నేను భాస్కరంగారి దగ్గరకు వెడుతూంటే అక్కయ్య ఓ కవరు నా చేతి కిచ్చి, ఆయనకు ఇవ్వమంది. ఆ రోజు మొదలు భాస్కరంగారిచ్చిన ఉత్తరం అక్కయ్యకు ఇవ్వడమూ, అక్కయ్య ఇచ్చిన ఉత్తరం భాస్కరంగారికి ఇవ్వడమూ మామూలైంది నాకు.

ఒక రోజు సాయంత్రం పార్కులో స్నేహితులతో దొంగాట ఆడుతూ మారుమూలకి పరుగెత్తాను. ఒక పొద వెనక అక్కయ్యా, భాస్కరంగారూ పక్కపక్కన కూర్చుని నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు. నన్ను చూడ్డంతో అక్కయ్య నవ్వు ఉన్నట్టుండి ఆగిపోయింది. కళ్లెర్రజేసి నా వైపు చూసింది. ఆ చూపుల్ని తట్టుకోలేక అక్కడినుండి జారుకున్నాను. ఫలితం—దొంగనయ్యాను! సాయంత్రం పూట స్నేహితురాళ్ల ఇంటికని ఇంట్లో చెప్పి ఎక్కడకు వెడుతూందో అర్థమయింది! తను వెళ్లేది భాస్కరంగారిని కలుసుకోవడానికన్న మాట! ఆ రాత్రి అక్కయ్య నన్ను తన గదిలోకి పిలిచి, తనూ భాస్కరంగారూ కలుసుకుంటున్నట్లు ఇంట్లో చెబితే ఒళ్లు హూనం చేస్తానన్నది!

అప్పుడప్పుడు అక్కయ్యా, భాస్కరంగారూ పార్కులో కనిపించేవారు. వాళ్ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం జరుగుతూనే ఉన్నాయి.

ఒక రోజు భాస్కరంగారి దగ్గర పాఠాలు చెప్పించుకుని, ఇంట్లోకి వెళ్లబోతూ మెట్లు తగిలి బోర్లాపడ్డాను. నా చేతిలో పుస్తకాలు నేలమీద చిందరవందరగా పడ్డాయి. మయూరాసనంలో కూర్చున్న నాన్నగారు వచ్చి నన్ను లేవనెత్తారు. కవరు సంగతి గుర్తుకి వచ్చింది. అది పుస్తకాల్లోంచి నేలమీద పడింది. దాన్ని ఆత్రతతో తీస్తూంటే నాన్నగారి దృష్టి దానిమీద పడింది. 'ఏమిటది?' అంటూ ఆ కవరు నా చేతిలోంచి తీసుకున్నారు. ఆ కవరుమీద మిస్. మీనాక్షి అని రాసి ఉంది. 'ఎవరిచ్చారు?' అన్నారు నాన్నగారు. ఒక్కముఖంతో 'లెక్చరరుగా'రన్నాను. నాన్నగారు నిశ్చేష్టులయినారు. 'ఎప్పటినుండి ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నా'యన్నారు. భయపడుతూనే జరిగినదంతా చెప్పేశాను. నేను



అప్పటికే ఏడుపుముఖం పెట్టడంవల్ల— 'ఇలాటి పనులు చెయ్యకూడదురా, ప్రకాశం' అనేసి, ఆ కవరు చించి ఉత్తరాన్ని బయటకు లాగారు. అది చదువుతూనే ఉగ్రులయ్యారు. నాలు గంగల్లో భోజనాల గదిలోకి వెళ్ళి, 'తిండి సంగతి తరవాత చూడచ్చు, నీ కూతురు చేస్తున్న ఘనకార్యం చూడు' అంటూ ఆ ఉత్తరాన్ని అమ్మ ముఖాన విసిరికొట్టారు. ఆ ఉత్తరాన్ని చదివిన అమ్మ ముఖం పాలిపోయింది. నోట మాట రాలేదు. అక్కయ్య గదిలోకి వెళ్ళి— 'నా కడుపున చెడబుట్టావే! ఇంటా వంటా లేదు. ఇవేం పెడబుద్ధులే' అంటూ నెత్తీ నోరూ బాదుకుంది అమ్మ. అక్కయ్య మాట్లాడలేదు. పిమ్మకు నీరెత్తినట్లు నిలబడింది. 'దానికి ఈ పూట అన్నం పెట్టకు' అని శాసించారు నాన్నగారు. నాన్నగారు నామకః నాలుగు మెతుకులు కొరికి భోజనం అయిందనిపించారు. వరండాలోకి వెళ్లి కుర్చీలో కూర్చున్నారు. హాల్లో కుర్చీలో నెత్తిన చెయ్యి పెట్టుకుని ఉలుకూ, పలుకూ లేకుండా కూర్చుని ఉంది అమ్మ. నాన్నగారు దీర్ఘంగా ఆలోచించి, 'రాజ్యం! పాపకు అన్నం పెట్టు' అన్నారు. అక్కయ్య తక్కువ తిన్నది కనకనా? గది తలుపులు బిగించుకుని, అమ్మ ఎంతగా బ్రతిమిలాడినా తలుపులు తియ్యలేదు.

ఆ మరునాడు ఉదయం అమ్మ కాఫీ ఇవ్వబోతే అక్కయ్య గ్లాసును విసిరి కొట్టింది. 'ఈ ఇల్లొక జైలు. ఇందులో బ్రతకడంకన్న చావడం మేలు' అన్నది ఆయాసపడుతూ. వరండాలో కుర్చీలో కూర్చున్న నాన్నగారి చెవిని పడ్డాయా మాటలు. ఆయన మనసు ఎంతగా నొచ్చుకుందో? అక్కయ్యకు ఏ విషయంలో లోటు చేశారు? ఆడపిల్ల ఒక్కర్తేనని ముద్దూ, ముచ్చటా తీరుస్తూ, అతి స్వాతంత్ర్యా న్నిచ్చారే! అమ్మా, నాన్నగారూ చేసిన తప్పు అదేనేమో? అందువల్లనే అక్కయ్యకు అంతకంతకూ మంకుతనం హెచ్చయిందేమో? నాన్నగారు చొక్కా వేసుకుని బయటకు వెళ్లిపోయారు. సుమా రొక గంట గడిచాక తిరిగి వచ్చారు. నిట్టూరుస్తూ కుర్చీలో చతికిలబడి అమ్మను పిలిచి, 'వాళ్లు మన వాళ్ళేట. వెనక ఆస్తి ఏమీ లేదు. తండ్రి హైస్కూల్లో టీచరు. ఇతను పెద్దవాడు. ఇతని తరవాత నలుగు రాడపిల్లలూ, ఇద్దరు మగపిల్లలూ ఉన్నారు. ఈ సంబంధం చేస్తే పాప సుఖపడుతుందంటావా, రాజ్యం?' అన్నారు. అమ్మ సమాధానం చెప్పలేక శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది.

ఆ తరవాత అమ్మ అక్కయ్యను అడిగింది. అక్కయ్య దృఢమైన స్వరంతో కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. నాన్నగారు చెప్పినదంతా తనకు తెలుసునట. డబ్బుకి తాను ప్రాముఖ్యం ఇవ్వదట. ఆయన ఉత్తములట. మనిషికి ముఖ్యమైనవి గుణగణాలు కాని, ఆస్తిపాస్తులు కావట. జీవితంలో వివాహమంటూ జరిగితే ఆయనతోనే జరగాలట. కాకపోతే జీవితాంతమూ అవివాహితగానే ఉండిపోతుందట!

ఫలితం—అక్కయ్య, భాస్కరంగార్ల వివాహం జరిగిపోయింది. నాన్నగారు అయిదు వేల కట్న మిచ్చి, కానుకలు చదివించి, పెళ్లి ఘనంగా చేశారు.

బావగారు మా పేటలోనే ఓ వాటా అద్దెకు తీసుకున్నారు. అక్కయ్య కాపరానికి వెళ్ళిపోయింది. పెళ్లయిన తరవాత అక్కయ్య మరింత మారింది. తన భర్త ధనవంతుడు కాదు కాబట్టి పెళ్లి సరిగ్గా చెయ్యలేదనేది. ఉన్నవాడైతే కట్నం అయిదు వేలే ఇచ్చేవారా? అనేది. అల్లుడికి ఓ స్కూటరు కొనిపెట్టగల తాహతే లేదా? అనేది. అల్లుడికి జరగవలసిన మర్యాదలు తన భర్తకు జరగడం లేదనేది. నాన్నగారు మౌనంగా ఉండిపోయేవారు. పండగ నాలుగు రోజులు ఉందనగానే వచ్చి, తనకూ తన భర్తకూ పెట్టవలసిన బట్టల జాబితా అమ్మ దగ్గర ఏకరువుపెట్టేది. నాన్నగారు నా చేత డబ్బిచ్చి అక్కయ్యతో బజారుకు వెళ్ళమనేవారు. ఇచ్చిన డబ్బు పూర్తయితేనే కాని అక్కయ్య ధ్యాస ఇంటివైపు మళ్లేది కాదు. పోనీ, అక్కడికైనా ముఖం విడుతుందనుకుంటే, 'మరో పాతిక ఉంటే ఆ జాకెట్టు గుడ్డ తీసుకుందుము కదా' అని వాపోయేది!

అయితే భాస్కరంగారిలో మార్పు లేదు. ఆయనకు నాన్నగారిపై ఎనలేని గౌరవముంది. ఒకటి రెండు సార్లు తెలియని లెక్కలు చెప్పించుకుందామని అక్కయ్యగారింటికి వెళ్ళాను. 'ఏరా! ఆయనకు కాలేజీకి సెలవైనా నీ ప్రైవేటుకి సెలవు లేదేమిట్రా? జీతం బత్తెంలేని ఉద్యోగం—బాగానే ఉంది. ఇలా మమ్మల్ని కాల్చుకు తినేకంటే నాన్నన డిగి ఎవరి దగ్గరైనా ప్రైవేటు పెట్టించుకోకూడదూ?' అంటూ అక్కయ్య సణిగింది. బావగారు అక్కయ్య మాటలు విని, 'అదేమిటి, మీనాక్షీ! ప్రకాశం పైవాడా చెప్పు? కాస్సేపు అతనికి పాఠం చెబితే నీ సొమ్మేం పోతుంది?' అంటూ సర్ది చెప్పబోయారు. 'సర్లెండి. నే నేదో చెబుతూంటే మీ రెందుకు కలుగజేసుకుంటారు?' అంటూ ఆయనపై తిరగబడింది అక్కయ్య. ఆయన ఏమనగలరు? బిక్కముఖం వేసుకుని ఇంటికి తిరిగి వచ్చేశాను. నాన్నగారితో జరిగింది చెప్పాను. ఫలితం— మా లెక్కల మాస్టారి దగ్గరే ప్రైవేటు పెట్టించారు. ప్రైవేటు వల్ల కాబోలు మాస్టారికి ప్రియశిష్యు డయ్యాను!

అక్కయ్య ఈ విధమైతే, అన్నయ్య మరొక విధం. దేశంలో ధరవరల్లా నెలనెలా వాడి ఖర్చు హెచ్చేదే కాని తగ్గేది కాదు. నెల ఆఖరి వారంలో డబ్బు తక్కువగా పంపిస్తుండడం వల్ల తాను ఎలాంటి కష్టాలు పడుతున్నదీ వివరిస్తూ వ్రాసేవాడు. సెలవులకు వచ్చినప్పుడల్లా అమ్మ దగ్గర గొణిగేవాడు— 'నాన్నగారు డబ్బు కటాకటిగా పంపుతారు. ఆయనకు మెడికల్ కాలేజీలో చదువంటే ఏం తెలుసు?' అంటూ.

సంవత్సరాలు తిరిగాయి. నేను కాలేజీలో ప్రవేశించాను. అక్కయ్య ఇద్దరు ఆడపిల్లల తల్లి అయింది. బావగారికి అనంతపురం ట్రాన్స్‌ఫర్ కావడంతో వాళ్లు రాజమండ్రి వదిలి వెళ్లిపోయారు. అన్నయ్య మెడిసిన్ పూర్తిచేసి, అక్కడే హౌస్ సర్జన్‌గా చేరాడు.

అన్నయ్యకు పెళ్లి చెయ్యాలన్న కోరిక అమ్మా, నాన్నగార్లకు కలిగింది. అన్నయ్య రాజమండ్రి వచ్చినప్పు డొకసారి అమ్మ వాడితో ఆ మాటే అంది. అన్నయ్య సిగ్గుపడుతూ, 'మీ మాట ఎప్పుడు కాదన్నానమ్మా?' అన్నాడు. అమ్మ మురిసిపోయింది. అయితే పెళ్లిచూపులకు వెడదామని అమ్మ అన్నప్పుడు అసలు విషయం బయటపెట్టాడు. తన క్లాస్‌మేటు రోజీని ప్రేమించాడట. ఆమె కూడా హౌస్ సర్జన్ అట. తా మిరువురూ పెళ్లిచేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారట.

## రాత్రి సకిలించింది

### ఎస్. మునిసుందరం

రాత్రి వచ్చింది
ఆటంబాంబు చెరచిన నగరంలా,
ఉరికంబా నెక్కనున్న శిరస్సులా,
యముని మహిషంలా, మాడిన శవంలా,
ఆకలిలా, దౌర్భాగ్యుని అశ్రువులా,
బలిపీఠం మీది మేక అరపులా
అసమర్థుని ఆవేదనలా
ఆ రాత్రి వచ్చింది.
విస్మృతిని విడిచి
మృత్యువును కౌగిలించుకోవాలని
కళ్లలో సూదులు గుచ్చి,
ఎముకల చలిని, నిరీక్షణ వేడిలో
కరిగిస్తూ, గదిని తింటూ,
సహనం చచ్చిన ఆ రాత్రి
శ్మశానంలా నన్ను చుట్టి
గుండెల్లో నల్లని కత్తి దించింది
హృదయం కుంపటిలో సిగరెట్ అంటించి
వణుకుతున్న నరాలకు వేడి ఇంజెక్షనిచ్చి
కౌగిట్లో చీకటిని నలిపివేయా లనుకుంటే
గుడిరాత్రి నిరసనగా ఘూర్ణిల్లింది
కాకిలా అరచి, క్రౌంచులా కరచి,
గూబలా ఘుశపించి, నాయకునిలా ఇకిలించి.
అబద్ధంలా వ్యాపించి, జనాభాలా పెరిగి,
నా నరాల్ని కొరికి, ఆ రాత్రి సకిలించింది. ★

రోజీ క్రిస్టియన్. నాన్నగారు కోపంతో వణికిపోయారు. ఆ పిల్లను పెళ్ళిచేసుకున్న పక్షంలో తనకూ, వాడికీ ఏ విధమైన సంబంధమూ ఉండదన్నారు. ఆస్తిలో చిల్లిగవ్వ దక్కదన్నారు. అన్నయ్య నదురూ బెదురూ లేకుండా చెప్పాడు. పెళ్ళన్నది జీవిత సమస్యట. కుల మత విభేదం తనకు లేదట. నాన్నగారు ఒప్పుకోని పక్షంలో రిజిస్ట్రారు వారి ఆఫీసు ఉండనే ఉందట. 'చూశావా, రాజ్యం? వీడు నాకు పాఠాలు చెబుతున్నాడు' అన్నారు నాన్నగారు నిర్లిప్తమైన స్వరంతో. ఆ రోజు రాత్రి నాన్నగారు నిద్రపోలేదు. వరండాలో కుర్చీలో ఆలోచిస్తూ కూర్చున్నారు. మరునాడు అమ్మతో అన్నారు: 'వాడికి రెక్కలొచ్చాయి. మనం చెప్పినా వినడని ఎలాగూ తేలింది. ఇలా తయారయ్యారు పిల్లలు. నే నేదో అడ్డు పడ్డానని నలుగురూ అనుకోవడమెందుకు? ఆ పెళ్ళేదో మన సమక్షంలోనే జరగనీ.' అమ్మ కళ్ళు తుడుచుకుంది.

అన్నయ్యా, రోజీల వివాహం జరిగిపోయింది. నాన్నగారిని గురించి నలుగురూ నాలుగు విధాల అనుకున్నారు. కొందరు 'సంఘ సంస్కర్త' అన్నారు. ఇంకొందరు 'ఆదర్శవాది' అన్నారు, మరికొందరు 'కొడుకు బుద్ధి పెడదారిని పడితే మందలించ వలసింది పోయి ఆ పిల్లతో వివాహం ఎలా జరిపించాడయ్యా?' అన్నారు. అమ్మా, నాన్నగార్లలో ఉత్సాహం అన్నయ్య వివాహం తరవాత దిగజారిపోయింది.


మరికొన్ని నెలలు గడిచినాయి. మా వీథిలో ఒక డాబా ఇల్లు అమ్మకానికి వచ్చింది. అది పరంధామయ్యగారు కొనుక్కున్నారు. అంతకు పూర్వం వాళ్ళు ఇన్నీసుపేటలో ఉండేవారు. పరంధామయ్యగారూ, నాన్నగారూ చిరకాల స్నేహితులు. తరుచుగా వాళ్ళిద్దరూ కలుసుకునేవారు. పరంధామయ్యగారు మా వీథిలోకి కాపరం వచ్చాక ఇంచుమించు రోజూ కలుసుకునేవారు. సాయంత్రాలు అయినా, నాన్నగారూ మా ఇంటిముందు పెరట్లో పూల మొక్కల్లో కుర్చీలు వేసుకుని కూర్చుని కబుర్లాడుకునేవారు. వాళ్ళ మాటల్లో చిన్ననాటి ముచ్చట్లు దగ్గర నుండి రాజకీయాలవరకు దొర్లేవి.

పరంధామయ్యగారి సంతానమల్లా నలుగు రాడపిల్లలు. మొదటి ముగ్గురికీ పెళ్ళిళ్ళయి కాపరాలకు వెళ్ళిపోయారు. కడసారి పిల్లపేరు ఇందుమతి. సుమారు పన్నెండేళ్ళ వయసు. సన్నని పొడవైన విగ్రహం. చెంపకు చారెడేసి కళ్ళు. పలచటి పెదాలపై పాలనురుగులాంటి చిరునగవు. అవయవాల్లో ఉదయిస్తున్న యౌవనం. భుజాలు దిగని రెండు జడలు. నుదుట కళ్యాణ తిలకం. చెవులకు జూకాలు. వస్త్రధారణ— పరికిణీ, జాకెట్టు. తండ్రి నాన్నగారితో మాట్లాడుతూంటే, చలాకీగా లేడిపిల్లలా గెంతులు వేస్తూ, కూనిరాగాలు తీస్తూ పూలమొక్కల్లో తిరిగేది. తనకు తోచినన్ని పువ్వులు కోసి, మాలను కట్టి '—అత్తయ్యగారూ! ఈ సగం మీకు' అంటూ సగ భాగాన్ని అమ్మ కిచ్చేది. స్వగృహంలోలాగే నదురూ బెదురూ లేకుండా ఇల్లంతా తిరిగేది. 'కూర ఏం చేశా'రంటూ వంట గదిలోకి తొంగి చూసేది. అమ్మా, ఇందుమతీ కొద్ది రోజుల్లోనే సన్నిహితులై పోయారు. ఏ రోజైనా ఇందుమతి మా ఇంటికి రాకపోతే, అమ్మ వాళ్ళింటి కెళ్ళేది. 'ఇందుని ఎవరు చేసుకుంటారో కాని, లక్షణమైన పిల్ల కదటోయ్' అనేవారు నాన్నగారు. 'నీ కా అభిమానం ఉంటే పై సంబంధాలు వెతకవలసిన అవసర మేమిటోయ్' అనేవారు పరంధామయ్యగారు. నాన్నగారు బదులు చెప్పేవారు కాదు. రాను రాను ఇందుమతికి నాతో కొత్త పోయింది. చనువుగా మెలిగేది. తెలియని పాఠాలు అడిగి చెప్పించుకునేది.

అన్నయ్య హౌస్ సర్జన్ పీరియడ్ ముగిసింది. 'నువ్వు ప్రాక్టీసు ఈ ఊళ్ళోనే పెట్టరా' అన్నారు నాన్నగారు వాడితో. 'ఈ ఊ రేమంత పెద్దది, నాన్నగారూ! విశాఖపట్నంలో అయితే పెద్ద పెద్ద డాక్టర్లతో పరిచయ ముంటుంది. అంతే కాక రోజీవాళ్ళ నాన్నగారు ఆ ఊళ్ళో డాక్టర్ కద. ఆయన అభిమతం మే మిద్దరం కలిసి ప్రాక్టీసు ఆ ఊళ్ళోనే పెట్టాలని' అన్నాడు అన్నయ్య. నాన్నగారు తెల్లబోయారు. నిన్నగాక మొన్న తన భార్య అయిన రోజీ తండ్రి అభిమతం నాన్నగారి అభిమతం కన్నా ఎక్కువదా? అన్నయ్య అంత నిష్కర్షగా ఎలా చెప్పగలిగాడు? నాన్నగారు సమాధాన మియ్యలేదు. ఫలితం— అన్నయ్య విశాఖపట్నంలోనే ప్రాక్టీసు పెట్టాడు.

మరో మూడేళ్ళు గడిచాయి. నేను బి. ఎస్‌సి. ఫస్టుక్లాసులో పాసయ్యాను. ఇందుమతి ఎస్. ఎస్. ఎల్. సి. పాసయింది. కాలగమనంతో ఇందుమతి రూపమూ మారింది. అవయవాల్లో నిండు యౌవనం తొంగిచూస్తున్నది. అంగసౌష్ఠవాన్ని వస్త్రాలు దాచలేక పోతున్నాయి. పూల రెమ్మ సౌకుమార్యాన్ని, సౌందర్యాన్ని తెచ్చుకున్నది. ఇందుమతి సౌందర్యానికి ప్రతిరూపమా? ప్రతినిధా? అసలు స్త్రీజాతికే మహారాణియా?

ఎమ్. ఎస్‌సి. చదువుకి నేను బెనారస్ వెళ్ళవలసి వచ్చింది. నేను ప్రయాణ




బాధ

చిత్రం— కొరసాల సీతారామస్వామి (తూ. గోదావరిజిల్లా)



మయ్యే రోజు ఇందుమతి మా ఇంటికి వచ్చింది. నేను సామాను సర్దుకుంటూంటే సాయం చేస్తూ, "మీరు ఆ ఊరు వెళ్లాక నేను గుర్తుంటానా?" అన్నది.

"అదేమిటి, ఇందూ! నీ ఫోటో నా దగ్గర్లేదు కాని, నీ రూపం నా హృదయంలో ఉంటుంది."

ఇందుమతి సిగ్గుపడింది.

"నేను ఉత్తరాలు రాస్తే నువ్వు జవాబు రాస్తావా?"

"తప్పకుండా. . ."

". . . . . ."

"మళ్ళీ ఎప్పుడొస్తారు?"

"మళ్ళీ వేసంగిలోనే నేమో? నువ్వు కాలేజీలో చేరతావా?"

ఇందుమతి తల ఊపింది.

నేను బెనారస్ వెళ్ళిపోయాను. అప్పుడప్పుడు ఇందుమతికి ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవాడిని. ఇందుమతి సమాధానాలు వ్రాసేది. ఇందుమతి కాలేజీలో చేరింది.

ఎమ్. ఎస్‌సి. ప్రీవియస్ పరీక్షలు వ్రాసి రాజమండ్రి చేరుకున్నాను. నాన్నగారిలో చెప్పలేనంత మార్పు వచ్చింది. ఆయన పూర్వంలా చలాకీగా మాట్లాడ్డం లేదు. కోపం తెచ్చుకోవడం లేదు. ఎల్లవేళలా ఆ కుర్చీలో కూర్చుని, దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండేవారు. ఎందు కాయన అంత దిగులుగా ఉంటున్నారో అర్థమయ్యేది కాదు. అక్కయ్య, అన్నయ్యలను తలుచుకోనా? వాళ్ళిద్దరూ ఆయనకు అంతులేని వ్యధ నిచ్చారు. అక్కయ్య ప్రేమలో పడితే, దాని ఇష్టప్రకారమే పెళ్లి చేశారు. కాని, దానికి డబ్బుపిచ్చి. అన్నయ్య రెక్కలొచ్చాక ఓ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానంటే ఎదురు చెప్పలేదు. కనీసం ఆయన కోరిన ప్రకారం అన్నయ్య ప్రాక్టీసు రాజమండ్రిలోనే పెడితే ఎంత బాగుండేది!

ఇందుమతి పి. యు. సి. పాసయింది. నేను ఎమ్. ఎస్‌సి. ప్రీవియస్ పాసయ్యాను. నాన్నగారు ముభావంగా 'సంతోషం' అన్నారు. ఒకరోజు ఉదయం నేనూ, నాన్నగారూ మాట్లాడుకుంటూ కూర్చున్నాం. నాన్నగారు హఠాత్తుగా — 'ఈ సెలవుల్లో నీ పెళ్లి చేసెయ్యాలని ఉందిరా, ప్రకాశం' అన్నారు.

నేను ఆలోచిస్తున్నంతలో తిరిగి, 'నువ్వు ఇందుమతిని చేసుకోవాలి' అన్నారు.

'ఇప్పుడు నా పెళ్లి కేమంత తొందరొచ్చింది? ఏడాదిలో చదు వెలాగా పూర్తవుతుంది. ఆ తరవాత ఏదైనా ఉద్యోగంలో చేరాక...' అంటూ నసిగాను.

'పెళ్లివల్ల నీ చదువుకేమీ అడ్డం డదు. ఉద్యోగం సంగతంటావా — అదే వస్తుంది. మనింట్లో ఓ పిల్ల భారం కాదు. నాకూ వయసు పైబడింది. ఏనాటి కెలా ఉంటానో?'

నాన్నగారి మాటలు నాకు అంతులేని వ్యధను కలగజేసినాయి. ఆయన వయసు ఏమంత పైబడింది? నాన్నగారు తగ్గు స్వరంతో అన్నారు:

'పెళ్లన్నది నూరేళ్ల పంట. ఈ విషయంలో బలవంతమేమీ లేదు. నీకు ఇష్టమయితేనే! తీరిగ్గా ఆలోచించుకుని చెప్పు.'

ఆ తరవాత ఆలోచించాను. ఇందుమతిపై హృదయంలో ఒక సున్నితమైన భావం ఉంది. అది ప్రేమో, అభిమానమో, అనురాగమో నాకు తెలియదు. ఆ తరవాత అమ్మ అడిగినప్పుడు చెప్పాను — 'మీ ఇష్టమే నా ఇష్టమమ్మా' అని. సుగుణాలప్రోవూ, సౌందర్యనిధీ అయిన ఇందుమతిని నేను చేసుకుంటాననడంలో వింతేమీ లేదు. అయితే, అదే వార్త నాన్నగారికి అంతులేని సంతోషాన్నిచ్చింది. అమ్మ సంతోషానికి అంతులేదు.

ఆ రోజు సాయంత్రం పరంధామయ్యగారూ, ఇందుమతీ మా ఇంటికి వచ్చారు. ఇందుమతి కబుర్లు చెప్పడానికి లోపలికి వెళ్లింది. నాన్నగారూ, పరంధామయ్యగారూ పూలమొక్కల్లో కుర్చీలు వేసుకుని కూర్చున్నారు.

"మా ప్రకాశం పెళ్లి ఈ సెలవుల్లోనే చేసెయ్యాలని ఉంది. వాడికి ఇందుమతిని ఇవ్వడానికి నీ కేమైనా అభ్యంతరముందా, పరం?"

పరంధామయ్యగారు ఉలిక్కిపడి నాన్నగారివైపు చూశారు. ఆ తరవాత కొద్ది క్షణాలు ఆయన మాట్లాడలేదు.

"కంగారు లేదు. తీరిగ్గా ఆలోచించుకుని చెప్పు."

"సుందరం! ప్రకాశం చదువు ఏడాదిలో పూర్తవుతుంది. ఇప్పుడు పెళ్లి చేస్తే అతని చదువు చెడుతుందేమో?"

"వాడి చదువు సంగతి బెంగ లేదు. వాడికి పట్టుదల ఉంది. నీకు కాని, ఇందుక్కాని ఇష్టం లేకపోతే చెప్పు."

"అదేమిటోయ్ అలా మాట్లాడతావు? ప్రకాశంలాటి అల్లుణ్ణి నే తేగలనా? ఇక ఇందు సంగతి — దానికి ప్రకాశమంటే ఇష్టమే. కేవలం ప్రకాశం చదువుదృష్ట్యా పెళ్లి వాయిదా వేస్తే మంచిదేమో అనుకున్నాను. మన స్నేహం బంధుత్వంగా మారడంకంటె నా

బెదురు చూపులు
చిత్రం— ఆర్. వి. ఆనందరావు
(మదరాసు - 26)

కింకేం కావాలి? నాకు చాలా సంతోషంగా ఉంది. మా ఆవిడ అప్పుడే సనుగుడు మొదలెట్టింది — పిల్లకి సంబంధాలు చూడ్డంలేదని."

"నాకూ సంతోషంగా ఉంది."

"తక్కిన విషయాలు తరవాత మాట్లాడుకుందామా?"

"తక్కిన విషయా లేమున్నాయి? నువ్వు ఇవ్వడం, నేను పుచ్చుకోవడం అన్న ప్రశక్తే లేదు."

పరంధామయ్యగారు నిండుగా నవ్వారు. నాన్నగారు హఠాత్తుగా— "అన్నట్లు, ఓ విషయం నీకు ముందే చెప్పాలి. మా అమ్మాయి లాంఛనాల విషయంలో మటుకు లోటు చెయ్యకు మమా. ఇప్పటికే నన్ను సాధిస్తోంది— పెద్దాడికి ఆ పెళ్లి చేసి తన కేమీ లాంఛనాలు లేకుండా చేశానని."

"అలాగేనోయ్."

"పెళ్లి మాత్రం ఘనంగా చెయ్యాలి. లోభత్వం చూపిస్తే ఊరుకునేది లేదు."

పరంధామయ్యగారు నవ్వేశారు.

పెళ్లి నిశ్చయమైంది. పెళ్లి ఓ వారంలోజు లుందనగానే అక్కయ్యా, బావగారూ, పిల్లలూ వచ్చారు. ఆ తరవాత రెండు మూడు రోజులకు అన్నయ్య వచ్చాడు. వదిన రాలేదు. ఒక రోజు సాయంత్రం నేనూ, అన్నయ్యా డాబా మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటు న్నాము.

"ఏరా, ప్రకాశం, ఈ పెళ్లి నీ కిష్టమయి చేసుకుంటున్నావా" అన్నాడు అన్నయ్య.

"అంటే?" అన్నయ్య వైపు ప్రశ్నార్థకంగా చూశాను.


"అబ్బే, ఏం లేదు. నీ చదువా పూర్తి కాలేదు. అంతేకాక పెళ్లన్నది జీవిత సమస్య. నాన్నగారి బలవంతంపై చేసు కుంటున్నావేమో ననిపిస్తోంది."

అన్నయ్యపై నాకు కోపం వచ్చింది. తనలాగే నేనూ ప్రేమలో పడి, పెద్దలకు ఎదురుచెప్పి వివాహం చేసుకోవాలనా? కాకపోతే నాన్నగారికి ప్రతి విషయం లోనూ ఎదురు చెప్పాలనా? నాన్నగారు ఎవరినీ, ఏ విషయంలోనూ శాసించరని వాడికి తెలియదా?

"అబ్బే, అదేం లేదు. నా కిష్టమయే చేసుకుంటున్నాను."

అన్నయ్య మాట్లాడలేదు.

ఇందుమతితో నా పెళ్లి జరిగి పోయింది. పెళ్లి ఘనంగా చేశారు. అతి ముఖ్యమైన విషయం—అక్కయ్యకు లాంఛనాలు భారీగా ముట్టజెప్పారు. అక్కయ్య తృప్తిపడింది! ఉన్న పది రోజులూ ఏ చికాకూ పెట్టకుండా నవ్వుతూ, చలాకీగా గడిపింది.




కొద్ది రోజులు గడిచాయి.

"ప్రకాశం ఈ ఊళ్ళో లేకపోయినా, ఇందు మాత్రం మా ఇంట్లోనే ఉంటుంది" అన్నారు నాన్నగారు పరంధామయ్యగారితో.

"ఎప్పటికైనా అది మీ ఇంటికి రావలసిందే కద. వస్తుంది నెమ్మదిగా" అన్నారు పరంధామయ్యగారు.

"ఏమంత దూరం వెళ్లిపోతోందని. ఒకే వీథిలో మరో ఇంటికి. ఇందు మాత్రం ఇక్కడే ఉండాలి."

"సరే, నీ ఇష్టం, సుందరం."

నేను ప్రయాణమయ్యే రోజు రానే వచ్చింది.

"ప్రకాశం! నేను కోరినట్లు పెళ్లి చేసుకున్నావు. కాని నువ్వు ఎమ్. ఎస్‌సి. ఫస్టు క్లాసులో పాసయినప్పుడే నాకు పూర్తిగా సంతోషం కలుగుతుంది. కాక పోతే అందరూ నన్ను ఆడిపోసుకుంటారు పెళ్లి చేసి నీ చదువు పాడుచేశానని. ఆ అపవాదు మాత్రం నాకు రానియ్యకు" అన్నారు నాన్నగారు.

"తప్పకుండా, నాన్నగారూ."

"మీ పరీక్ష లెప్పటి కవుతాయి?"

"వచ్చే మే నాటికి."

"అంటే సుమారు పది నెలలన్న మాట!" నాన్నగారు నిట్టూర్పు విడిచారు.

స్టేషనుకు పరంధామయ్యగారూ, నాన్నగారూ, ఇందుమతీ వచ్చారు. నన్నూ, ఇందుమతినీ ఏకాంతంగా వదిలి నాన్న గారూ, పరంధామయ్యగారూ మాట్లాడు కుంటూ కాస్త దూరంలో నిలబడ్డారు. నేను ఇందుమతితో ఎంతో మాట్లాడదా మనుకున్నాను. అయితే మాట్లాడలేక పోయాను. ఇంతలో రైలు వచ్చింది. సామాన్లు లోపల పెట్టించాక, "శ్రద్ధగా చదవండి. మీరు ఫస్టు క్లాసులో పాసవ్వాలి. ఉత్తరాలు వ్రాస్తూ ఉండండి" అన్నది ఇందుమతి.

'సరే'నని రైలెక్కాను. రైలు కదలబోతూంటే నాన్నగా రన్నారు:

"వారాని కో ఉత్తరం వ్రాస్తూండు, ప్రకాశం. మాకు కాకపోయినా ఇందుకి వ్రాస్తూండు."

పరంధామయ్యగారు నవ్వేశారు. ఇందుమతి సిగ్గుతో తల దించుకుంది. రైలు కదిలింది.

ఇందుమతి కాలేజీలో చేరింది. మకాం మా ఇంటికి మార్చింది.

నేను మరింత శ్రద్ధతో చదవసాగాను. నాన్నగారి మాటలే నాకు గుర్తుకు వచ్చేవి. నాన్నగారి మాటలు నిజం. నేను ఫస్టు క్లాసులో పాసవకపోతే అందరు ఆయన్ని ఆడిపోసుకుంటారు, 'పెళ్లి చేసి నా చదువు చెడగొట్టా'రని. నా దృఢ సంకల్పమల్లా—ఫస్టు క్లాసులో మంచి మార్కులతో పాసవ్వాలి.

ఏడెనిమిది నెలలు గడిచాయి. ఒక రోజు పరంధామయ్యగారి దగ్గరి నుండి టెలిగ్రామ్ వచ్చింది. 'ఫాదర్ సీరియస్. స్టార్ట్ ఇమిడియట్లీ!' వెంటనే ప్రొఫెసర్ గారి దగ్గరకు వెళ్లి విషయం చెప్పాను. ఆయన చాలా ఫీలయి, 'మరేం కంగారు పడకు, రావ్. దేవుడి దయవల్ల ఆయనకు తగ్గాలి. అనవసరంగా మనసు పాడు చేసుకోకు. రేపే బయలుదేరి వెళ్లు. వీలైనంత త్వరలో వచ్చెయ్. కూడా పుస్తకాలు తీసుకువెళ్లు. నువ్వు సిన్సియర్ స్టూడెంటువి కద. మరేం భయం లేదు' అన్నాడు. ఆ మరునాడే ప్రయాణ మయ్యాను. రాత్రులు గడిచాయి. పగళ్లు గడిచాయి. నా మనసులో చెలరేగే ఆలోచన అల్లా నాన్నగారిని గురించే. ఆయన పిల్లలవల్ల సుఖపడలేదు. కనీసం నే నయినా సుఖపెట్టాలి. అసలు ఎన్నడూ నలతన్నది ఎరగని నాన్నగారికి సీరియస్‌గా ఉండడమేమిటి?

సంధ్య చీకట్లు ముసురుకుంటున్న వేళ రైలు రాజమండ్రి చేరింది. స్టేషనుకు పరంధామయ్యగారు వచ్చారు. ఆయన గుర్తు పట్టలేనట్లున్నారు. మాసిన గడ్డమూ, నలిగిన పంచె, చొక్కా, చెదిరిన జుత్తూ—ఆయ నలా తయారయా రేమిటి? 'పువ్వులా తయారవురారా, పరం' అని నాన్నగారు హాస్యం చేసే పరంధామయ్యగారేనా ఆయన? రిక్షా ఎక్కాక అడిగాను:

"నాన్నగారికి ఎలా ఉంది?"

"పద, ప్రకాశం. ఇంటికి వెడదాం."

పరంధామయ్యగారివైపు చూశాను. ఆయన శూన్యంలోకి చూస్తున్నారు. నా మనసులో అనుమానం పొడసూపింది. ఆయన ఎలాటి మాట చెబుతారో అన్న భయంతో నేను మరి మాట్లాడలేదు. రిక్షా ఇల్లు చేరింది.

వరండాలో అక్కయ్య పిల్లలు ఆడుకుంటున్నారు. నాన్నగారి కుర్చీ ఖాళీగా ఉంది. భగవంతుడా! నన్ను చూస్తూనే అక్కయ్య హాల్లోకి వచ్చింది.

(తరువాయి 149 వ పేజీలో)

# ఆ ఇంటి కథ

(143 వ పేజీ తరువాయి)

"నాన్న మనల్ని విడిచి వెళ్ళిపోయాడురా" అంటూ రాగాలు పెట్టింది.

నాకు మాట్లాడే శక్తి లేదు. కుర్చీలో కూలబడ్డాను. అంతా శూన్యం.

"మొదటిసారి గుండెపోటు వచ్చినప్పుడు ఆశ లేనిపించింది. తగ్గింది. దేవుడు కరుణామయు డనుకుని సంతోషించాం. కాని..." పరంధామయ్యగారు మాటలు పూర్తిచేసే శక్తి లేక వెక్కివెక్కి ఏడిచారు.

"కాఫీ తీసుకోండి."

కళ్ళు తెరిచి చూశాను. ఇందుమతి కళ్ళు ఉబ్బి ఉన్నాయి. కళ్ళలో ఎర్రటి జీర ఉంది. జుత్తంతా చెదిరి ఉంది. కాఫీగ్లాసు నా చేతికి అందిచ్చి లోపలికి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి నాకూ, పరంధామయ్యగారికీ, తనకూ డాబామీద పక్కలు వేసింది ఇందుమతి. "పెళ్ళయిన వెంటనే నేను ఇక్కడకు మకాం మార్చకపోతే నాకూ తెలిసేది కాదు. మామయ్యగారిది పసివాడి మనసు. కాఫీ తాగాలని ఉంటే 'కాఫీ తాగాలని ఉందమ్మా, ఇందూ' అనేవారు. ఏదైనా మొక్క నాటాలంటే నా చేత నాటించేవారు. సాయంత్రం పూట ఆ మొక్కల్లో కూర్చుని ఎన్నెన్నో కబుర్లు చెప్పేవారు. పోయే రోజు రాత్రి ఎన్ని కబుర్లు చెప్పారనుకున్నారు" అన్నది ఇందుమతి.

పరంధామయ్యగారిలో చెప్పలేనంత మార్పు వచ్చింది. ఆయన కళ్ళలో జీవం లేదు. ఏదో తిరుగుతున్నారన్న మాటే కాని, ఆయనలో ఉత్సాహం లేదు. నాన్నగారూ, ఆయనా ఎంత ఆప్తమిత్రులో నాకు తెలుసు. ఇంచుమించు వాళ్ళు కలుసుకోని రోజంటూ ఉండేది కాదు. ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకున్నారు. కష్టసుఖాలు విచారించుకునేవారు; ఒకరి నొకరు ఓదార్చుకునేవారు. "మొదటిసారి గుండెపోటు వచ్చినప్పుడు ఆశ లేనిపించింది. తగ్గింది. దేవుడు కరుణామయుడని ఎంతగానో సంతోషించాం. అయితే, అది కేవలం అతనిచేత కొన్ని పనులు చేయించడానికేనేమో అనిపిస్తోంది. నాలుగు రోజుల క్రితం తనే స్వయంగా వెళ్ళి, బాంకిలో ఉన్న డబ్బంతా విత్‌డ్రా చేశాడు. అది ఇందు చేతి కిచ్చాడు. 'వాడికి నే నేమీ చెయ్యలేకపోయాను. చదువా పూర్తి కాలేదు. వాడి కొక ఉద్యోగం దొరికేవరకూ ఎవరిని అడుగుతాడు? నా దగ్గర మిగిలినదల్లా అయిదు వేల చిల్లర. నీ దగ్గర ఉంచు' అంటూ దాని చేతి కిచ్చాడు. ఆ రాత్రే వాడికి తిరిగి గుండెపోటు వచ్చింది. మరునాడు ఉదయం . . ." పరంధామయ్యగారు మాటలు పూర్తిచేసే శక్తి లేక వెక్కి వెక్కి ఏడిచారు.

కొద్ది సేపయిన తరవాత పరంధామయ్యగారు తిరిగి అన్నారు: "మీ నాన్నా, నేనూ చిన్నప్పటినుంచీ కలిసిమెలిసి తిరిగిన వాళ్ళం. అతని గురించి నాకు తెలిసినంత మరెవరికీ తెలియదేమో? రిటైరయ్యేంత వరకూ నీతి కోసం, నిజాయితీ కోసం ప్రాకులాడాడు. ఈ రోజుల్లో వాటికి విలువ లేదు. బ్రతుకుతెరువు తెలిసిన వాడు కాదన్నారు. అత నొక శాంతమూర్తి. అతని క్రింద పనిచేసిన వాళ్ళ నెవరి నడిగినా అదే మాట చెబుతారు. అత నొక ఆదర్శ మూర్తి. ఎవరికీ ఏ విషయంలోనూ అడ్డు నిలవలేదు. అత నొక మానసిక శాస్త్రవేత్త. ఎదటి వారి మనసును అర్థం చేసుకునేవాడు. అయితే, అత న్నెవరూ సరిగా అర్థం చేసుకోలేదు."

పరంధామయ్యగారి మాటలు నిజం. నాన్నగారిని ఎవరూ సరిగా అర్థం చేసుకోలేదు. అన్నయ్య వచ్చి వెళ్ళాడట. మళ్లీ ఒకసారి వస్తానన్నాడట. బావగారుకూడా వచ్చి వెళ్ళారట.

ఆ మరునాడు సాయంత్రం నేనూ, పరంధామయ్యగారూ పూలమొక్కల్లో కుర్చీలు వేసుకుని కూర్చున్నాం.

"నీ పరీక్ష లెప్పట్నుంచి?" అన్నా రాయన.

చెప్పాను.

"అంటే రెండు నెలల పైనే ఉందన్న మాట. ఏం చేద్దామనుకుంటున్నావు?"

ఆలోచిస్తూ ఉండిపోయాను. ఇలాటి మానసిక పరిస్థితిలో చదివి పాసవగలనా?

"ఈ లోటు ఒకరు తీర్చగలిగేది కాదు, ప్రకాశం. నువ్వు పరీక్షకు వెళ్ళక పోయినా ఈ లోటు తీరేది కాదు. ఒక సంగతి నీకు తెలుసు ననుకుంటాను. అది నీ పెళ్ళికి ముందుమాట. నీ చదువయ్యేంత వరకూ పెళ్ళి వాయిదా వేద్దామన్నాను. మీ నాన్న ససేమిరా వీల్లే దన్నాడు. నా భయమల్లా పెళ్ళి నీ చదువు పాడుచేస్తుందని. 'వాడి దృఢ నిశ్చయం నాకు తెలుసు. ఈ పెళ్ళి వాడి చదువుకు అడ్డురాదు' అన్నాడు మీ నాన్న. ఇప్పుడు నువ్వు పరీక్షకు వెళ్ళకపోతే మీ నాన్న ఆత్మకి శాంతి ఉండదు. 'పెళ్ళి చెయ్యడం వల్ల ప్రకాశం చదువు పాడవదు కద' అనేవాడు. అంతలోనే సర్దుకునే వాడు. 'వాడి పట్టుదల నాకు తెలుసు. తప్పకుండా ఫస్టు క్లాసులో పాసవుతాడు' అనేవాడు. ఇప్పుడు మీ నాన్న లేకపోవచ్చు. అయితే, అతడి మాట నిజం చెయ్యడం నీ విధి. నువ్వు పరీక్షకు వెళ్ళాలి. ఫస్టుక్లాసులో పాసవ్వాలి. అప్పుడే మీ నాన్న ఆత్మకి నిజమైన శాంతి కలుగుతుంది."

ఇందుకూడా ఆ మాటే అంది. "మా ఇంట్లో బంధువుల గడబిడ లేదు. నువ్వు అక్కడ చదువుకో. ఈ కర్మ తతంగం కొద్ది రోజుల్లో అయిపోతుంది. ఆ వెంటనే నువ్వు వెడుదువుగాని."

'సరే'నడక తప్పింది కాదు.

నేను ప్రయాణమయ్యే రోజు దగ్గర పడింది. అన్నయ్య వచ్చాడు. అమ్మను ఎక్కడ ఉంచాలన్న సమస్య ఎదురైంది.

"అమ్మ ఆచారాల సంగతి మనకు తెలియంది కాదు. తనకూ, మీ వదినకూ మతవిభేదం ఉండనే ఉంది" అన్నాడు అన్నయ్య.

"పెళ్ళయ్యాక ఆడపిల్ల పరాయి ఇంటి దయిపోతుంది. నాకు తీసుకువెళ్ళాలని ఉన్నా ఆయన వైపు వా ళ్ళేమను కుంటారు? అక్కడ నాకు స్వాతంత్ర్యం ఏముంది?" అన్నది అక్కయ్య.


వాళ్ళ మాటలు వినగానే నాకు అసహ్యం వేసింది. పరంధామయ్యగారు కాస్త కఠినమైన స్వరంతో అన్నారు: "ఆవిడను ఎవరు తీసుకువెళ్ళాలని మీ రిద్దరూ పంతులు వేసుకోనక్కర్లేదు. ఆవిడ ఎక్కడికీ వెళ్లరు. ఈ ఇంట్లోనే ఉంటారు. ఇందు ఇక్కడే ఉంటుంది కద? ప్రకాశం పరీక్షలు రెండు నెలల్లో అయిపోతాయి. ఆ తరవాత సంగతి చూసుకోవచ్చు."


అన్నయ్యా, అక్కయ్యా తేలిగ్గా ఊపిరి తీసుకున్నారు. ఏం మనుష్యులు? కన్న తల్లిని తీసుకెళ్లవలసి వస్తుందని భయపడి పోయారు!

ఆ మరునాడే అన్నయ్య వెళ్ళి పోయాడు.

ఆ తరవాత పరంధామయ్యగా రన్నారు: "మీ అమ్మను గురించి బెంగపడకు, ప్రకాశం. ఇందు ఇక్కడే ఉంటుంది. ఆవిడకు ఏ లోటూ రాదు. నేనూ, వాళ్ళమ్మా చూస్తూ ఉంటాం."

నేను తిరిగి బెనారస్ చేరుకున్నాను. నాలో చైతన్యం ఎలా కలిగిందో నాకే తెలియదు. రాత్రనక, పగలనక చదివాను. నాన్నగారి మరణం అసత్యంగానే తోచేది. ఆయన మూర్తి నా కళ్ళముందు మెదులుతున్నట్లు, నవ్వుముఖంతో ఆయన నాతో మాట్లాడుతున్నట్లు, ప్రోత్సాహ





ఇరుకు దారి

ఫోటో— పి. జి. ఎస్. రెడ్డి (నెల్లూరు)

మిస్తున్నట్లు అనిపించేది. నేను చదివింది వృథా పోలేదు. పరీక్షలు బాగా వ్రాశాను. ఫస్టు క్లాసు తప్పకుండా వస్తుందన్న నమ్మకం కలిగింది.

రాజమండ్రి చేరుకున్నాను. సుమారు రెండు నెలలు గడిచాయి. మా రిజల్ట్సు వచ్చాయి. నేను ఫస్టు క్లాసులో పాసయ్యాను.

"మీ నాన్న ఆత్మ శాంతిస్తుంది" అన్నారు పరంధామయ్యగారు.

"ఆయనే ఉంటే ఎంత సంతోషించే వారో" అన్నది ఇందుమతి.

నేను ఉద్యోగ ప్రయత్నాల్లో పడ్డాను. అక్కయ్య ఉత్తరం వ్రాసింది. తనకు మమ్మల్నందరినీ చూడాలని ఉందనీ, పిల్లలుకూడా అమ్మమ్మగారింటికి వెడదామని ప్రయాణ మవుతున్నారనీ, డబ్బు ఖర్చు దృష్టిలో పెట్టుకుని వెనుకాడుతున్నాననీ వ్రాసింది. ఆ వ్రాసేదేదో తిన్నగా వ్రాయకూడదూ—డబ్బు పంపించమని? ఆ మరునాడే మనియార్డర్ చేశాను. అక్కయ్య రాకలో ఏదో అంత రార్థ ముం దనిపించింది.

ఓ వారం రోజులు గడిచాక అక్కయ్య పిల్లలతో వచ్చింది. ఆ తరవాత ఒకటి రెండు రోజులకు అన్నయ్య వచ్చాడు. అన్నయ్య తన మనసులోని మాట బయట పెట్టాడు.

"మన వ్యవహారాలు పరిష్కరించుకోవాలిరా. ఉద్యోగమైతే నువ్వు ఏ ఊళ్లో ఉంటావో! మనం తరచుగా కలుసుకోలేకపోవచ్చు" అన్నాడు.

"అంత పరిష్కరించుకోవలసిన వ్యవహారా లేమున్నాయి? పదెకరాల పొలం, ఇల్లేగా?"

"పొలం సంగతి సరేననుకో— చెరి సగం తీసుకోవచ్చు. మా మామగారు మీ వదినపేర ఈ ఊళ్లో కొందామనుకుంటున్నారు. నాన్నగారి అభిమతం నేను ఈ ఊళ్లోనే ప్రాక్టీసు పెట్టాలని. నువ్వు మాత్రం ఈ ఊళ్లో ఉండేవాడివా చెప్పు. నీ వాటాకి ఎంత కావాలంటే అంతే ఇప్పించే పూచీ నాది."

కొంతసేపు మాట్లాడ లేకపోయాను. లోలోపల నవ్వుకున్నాను. నాన్నగారు ఆ ఊళ్లో ప్రాక్టీసు పెట్టమన్నప్పుడు తన మామగారి అభిమతం తెలియజేశాడు. ఆయన పోయాక ఆయన అభిమతం ప్రకారం నడుచుకోవా లనుకుంటున్నాడట!

నేను ఆలోచిస్తూ ఉండడం గమనించి, "కంగారు లేదు. తీరిగ్గా ఆలోచించుకుని చెప్పు" అన్నాడు అన్నయ్య.

ఈ విషయంలో పరంధామయ్యగారి సలహా అడిగితే మంచిదనిపించింది. తగిన సమయం చూసి ఆయనతో చెప్పాను.

ఆయన తెల్లబోయారు.

"మీ అన్నయ్యకు ఈ ఊళ్లో ప్రాక్టీసు పెట్టాలన్న బుద్ధి మీ నాన్న ఉన్నప్పుడు ఎక్కడకు పోయింది? నీ వాటా అమ్మమంటాడా? ఉన్న వాటాని అమ్ముకుని, రిటైరయ్యాక ఎక్కడుంటావు? ఈ రోజుల్లో ఇల్లు కట్టగలమా?"

ఇందుమతికూడా ఇంచుమించు అలాగే అన్నది.

"మీకు చెప్పవలసినంతదాన్ని కాదు. మీరు వాటా అమ్మడం మీ అమ్మగారికి కూడా ఇష్టం ఉండదు. ఈ ఇంట్లో వాటా అంటూ ఉంది. అది అమ్మేస్తే మిగిలేది అయిదెకరాల పొలం. అదికూడా అమ్మేస్తే సరి. మనం ఈ ఛాయలకి రానక్కర్లేదు. . ."

ఆ తరవాత అన్నయ్య అడిగినప్పుడు సౌమ్యంగా చెప్పాను:

"నేను ఈ ఊళ్లో ఉండేవాణ్ణి కాదు. ఇల్లంతా నువ్వే వాడుకోవచ్చు. ఆ పాటిదానికి ఒకరి కొకరు అమ్ముకోవడమెందుకు?"

"ఒరేయ్! ఆ చెప్పేదేదో తిన్నగా చెప్పకూడదూ—అమ్మడం నా కిష్టంలేదని. నా వాటా అమ్మేస్తాను. కావాలంటే నువ్వు కొనుక్కోవచ్చు. కాకపోతే పై వాళ్లకు అమ్మేస్తాను." నేను తెల్లబోయాను. పుల్ల విరిచినట్లు మాట్లాడుతున్న అన్నయ్యకి నే నేమని సమాధానం చెప్పగలను? కావాలని దూరమవుదామని అనుకుంటున్న వాడి దగ్గర మొరపెట్టుకుని లాభమేమిటి? ఈ విషయం పరంధామయ్యగారితోనూ, ఇందుమతితోనూ చెప్పాను. ఇందుమతి తెల్లబోయింది. పరంధామయ్యగారు నిర్ఘాంతపోయారు. చివరకు తేరుకుని, "తన వాటాకి ఎంత కావాలో అడుగు. అది నే నిస్తాను. నువ్వేం పైవాడివి కాదు" అన్నారు.

అన్నయ్య చాలా సంతోషించాడు. నేను బాధపడ్డాను.

"నాన్నపేర బాంకిలో డబ్బు ఉండేది. అది ఏమయింది?" అన్నది అక్కయ్య.

"అవును, ఉండేది. మీ అల్పబుద్ధి మామయ్యగారికి తెలుసు. ఆ డబ్బులో మీరు వాటాకి వస్తారని ఆయనకు తెలుసు. అందుచేత పోయేముందు ఆ

డబ్బంతా డ్రా చేసి నా కిచ్చేశారు. ఆ డబ్బులో ఓ పైసాకూడా మీకు రాదు. ఓ నెల్లాళ్ళ మీ అమ్మగారిని తీసుకు వెళ్ళవలసివస్తుందని భయపడి పోయారే— అలాంటిది మీ నాన్నగారి డబ్బు కావలసి వచ్చింది. ఛీ ఛీ! ఏం మనుష్యులు!" అన్నది ఇందుమతి కటువుగా.

అక్కయ్య ముఖం పైసా అంత చేసుకుంది. ఇందుమతి అలా మాట్లాడ గలదని నే ననుకోలేదు. ఆ తరవాత అక్కయ్య అమ్మ దగ్గర మిగిలిన నగల కోసం ఆశపడింది.

"ఆశకు అంతుండాలే, పాపా! మీ నాన్నగారు ఉన్నంతకాలమూ ఆయన్ని డబ్బో, డబ్బో అని పీక్కుతినేదానివి. ఎంతిచ్చినా నువ్వెప్పుడూ తృప్తి పడలేదు. నీ పెళ్ళికి కాసులపేరు చెరిపించి నగలు చేయించాను. ఆ తరవాత రాళ్ళదుద్దుల కోసం మోజు పడ్డావని ఇచ్చేశాను. ఏదో పెద్దమనవరాలు కదాఅని నీ పెద్దమ్మ కూతురికి గొలుసు ఇచ్చేశాను. ఇంక మిగిలినవి కొద్ది. ఇందుకి నేను ఇచ్చిం దేమీ లేదు. అవి దానికి ఇచ్చేస్తాను" అన్నది అమ్మ.

"కూతురు కంటె కోడలు ఎక్కువటే?" అన్నది అక్కయ్య.

"అదొచ్చేసరికి నా దగ్గర మిగిలిన వేమిటే, వెర్రిదానా! ఇంక నగల కోసం ఆశపడకు. అవి ఇందుకి ఇచ్చేస్తాను."

అక్కయ్య ఏమనుకుందో మరి, మాట్లాడలేదు.

ఇంట్లో సామాను కోసం అక్కయ్యా, అన్నయ్యా వంతులు పడ్డం చూస్తే అసహ్యం వేసింది.

"పాపం, నాన్న అనుకునేవారు— 'మా ఆయనకి వాచీ కొందామంటే ఎప్పటి కప్పుడు పడ్డం లేదే!' అని. ఇంట్లో బట్టలు పెట్టుకోవడానికి సరైన బీరువా లేదు" అంటూ మాటలు సాగదీస్తూ, తనకు కావలసిన సామాన్ల జాబితా చదివింది.

అన్నయ్య తక్కువ తిన్నాడా? తనకు కావలసినవి తనూ చదివాడు. ఇక ఇంట్లో మిగిలిన వేమంత విలువైనవి కావు. బొగ్గుల్లో మాణిక్యంలా నన్ను ఆకర్షించింది మయూరాసనం. వాళ్ళ దృష్టిలో దాని విలువ పది, పదిహేను రూపాయలు. ఇందుమతి నా వైపు బాధగా చూసింది. 'అంత మంచితనం పనికిరాదోయ్' అన్నారు పరంధామయ్యగారు.

ఆ తరవాత కొద్ది రోజులకు నాకు హైదరాబాదులో ఉద్యోగం వచ్చింది. ముందు హైదరాబాదు వెళ్ళి ఉద్యోగంలో చేరి, ఇల్లు చూసుకుని, ఇందుమతినీ, అమ్మనూ తీసుకువెళ్ళడానికి రాజమండ్రి వెళ్ళాను. ఇంటి బాధ్యత పరంధామయ్య గారికే అప్పజెప్పాము.

"మీరూ, అత్తయ్యగారూ కూడా మాతో వచ్చెయ్యకూడదూ?" అన్నాను పరంధామయ్యగారితో.

"వస్తాం, ప్రకాశం! కానీ ఇప్పుడు కాదు. మాకు నీతో ఉన్న చనువు తక్కిన అల్లుళ్ల దగ్గర లేదు. నువ్వు మా సుందరం కొడుకువి" అన్నా రాయన.

మేము హైదరాబాదు ప్రయాణమయ్యే రోజు రానే వచ్చింది. స్టేషనుకు పరంధామయ్యగారూ, ఆయన భార్యా వచ్చారు. రైలు రాగానే అమ్మని ఎక్కించాము. ఆవిడ అమ్మతో మాట్లాడుతూంది. నేనూ, ఇందుమతీ ప్లాటుఫారమ్మీద నిలబడ్డాము.

"నీకూ, ఇందుకీ తెలియని విషయం ఒకటుంది, ప్రకాశం. నీ పెళ్ళివిషయంలో నువ్వు మీ నాన్న కోరిక తీర్చావని అనుకుంటున్నావు కదూ?" అన్నారు పరంధామయ్యగారు.

ఆయన వైపు ప్రశ్నార్థకంగా చూశాను. ఆయన నవ్వారు.

"ఇందు అంటే నువ్వు ఇష్టపడుతున్నావనీ, నువ్వంటే ఇందు ఇష్టపడుతోందని నాకూ, మీ నాన్నకూకూడా తెలుసు. అయితే, మీ నాన్నకు నీ మనస్తత్వం తెలియంది కాదు. నువ్వు ధైర్యంగా అతని ముందు నిలబడి నీ మనసులో ఉన్నది చెప్పలేవు. అందుచేత తన కోరికగా తెలియజెప్పి, నీ చేత అవుననిపించాడు. అయితే నా కర్థం కానిది ఒకటే. పెళ్ళి కోసం అంత కంగారెందుకు పడ్డాడా? అని. ముందు ముందు సమస్యలు ఎలా తయారవుతాయో? అనుకున్నాడో, లేకపోతే తను ఎంతకాలమో బ్రతకడని అతనికి అనిపించిందో మరి."

నేనూ, ఇందుమతి ఒకరి మొహా లొకరం చూసుకున్నాము.

ఆ తరవాత ఏణ్ణర్ధానికి మా అబ్బాయి పుట్టాడు. వాడి పేరు సుందరమూర్తి. వాడిది మా నాన్నగారి పోలిక అంటుంది ఇందుమతి.

"ఏమిటి పది కావస్తున్నా ఆకలి కావడం లేదూ? రోజూ ఎనిమిదయ్యేసరికల్లా నాలుగు సార్లు వంటింట్లోకి తొంగి చూసేవారు— 'వంటయిందా?' అంటూ."

ఉలిక్కిపడి తల పైకెత్తి చూశాను. నా కళ్ళు చెమర్చి ఉండడం చూసి, కంగారుగా నుదుట చెయ్యి వేసి చూస్తూ, "ఏమిటలా ఉన్నారు? ఒంట్లో బాగుండలేదా?" అన్నది ఇందుమతి.



ఆమె....
చిత్రం — వి. పక్కుబాయి
(కొత్తగూడెం)

"ఒంట్లో బాగానే ఉంది, ఇందూ, మనసే బాగుండలేదు."

"మరీ అంత మెత్తని మనసేమిటండీ మీది. అంత చిన్న విషయానికి అంతగా మనసు పాడు చేసుకోవాలా?" కొంగుతో కళ్ళు తుడుస్తూ అన్నది.

కుర్చీలోంచి లేచి, ఇందుమతిని అనుసరిస్తూ అన్నాను:

"బాబు పడుకున్నాడా?"

"ఆకలికి ఉండలేడు వెధవన్న. అల్లరి చేసి చేసి పడుకున్నాడు."

ఇందుమతి భోజనాల గదివైపు దారి తీసింది. పడక గదిలో ఒక్క క్షణం నిలబడ్డాను.

సుందరమూర్తి నిశ్చింతగా కాళ్ళూ, చేతులూ బారజాపుకుని నిద్రపోతున్నాడు.

పెదాలపై అదే చిరునవ్వు. అవే కళ్ళు. అదే ముక్కు.

భోజనాల గదిలోకి వెళ్ళాను.

వడ్డన పూర్తిచేసి, నా పక్కకు వచ్చి కూర్చుంటూ ఇందుమతి అన్నది: "ఏదో పది రోజులు ఉంచుకుని పంపిస్తానంటే ఏమో అనుకున్నాను. రెండు నెలలు కావస్తోంది. మీ అమ్మగారిని వెంటనే పంపించమని మీ అక్కయ్యకు వ్రాయండి. అత్తయ్యగారు లేకపోతే నాకూ తోచడం లేదు. పైగా, మీరు మరీ దిగాలుగా ఉంటున్నారు." ★

